క్లుప్తంగా

అమ్మవారి సన్నిధిలో భక్తుల సందడి



పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీతిరుపతమ్మవారిని ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. సెలవు దినంతో పాటు పలు శుభ కార్యాలు ఉండటంతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి. భక్తులు అమ్మవారికి పొంగళ్లు సమర్పించారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. గ్రామంలో ట్రాఫిక్ అవరోధాలు లేకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా అంకమ్మ రథోత్సవం



నందిగామ: పట్టణంలోని రెవెన్యూ కాలనీలో భద్రకాళి సమేత వీరభద్ర స్వామి కల్యాణ మహోత్సవం కొనసాగుతోంది. ఇందులో భాగంగా స్వామి వార్ల కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం రాత్రి పట్టణంలో జలబిందెల ఊరేగింపు , అంకమ్మ తల్లి రథోత్సవం కనుల పండువగా జరిగింది. అక్కడ జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

పోరాటయోధుడు శివాజీ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఛత్రపతి శివాజీ గొప్ప పోరాటయోధుడు అని పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. పాతబస్తీలోని వివిధ సంఘాల ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో శివాజీ జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. అందులో భాగంగా బావాజీమఠం వద్ద నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే వెలంపల్లి పాల్గొని శివాజీ విగ్రహానికి నివాళులర్పించారు. దేశానికి శివాజీ చేసిన సేవలను కొనియాడారు. కాళేశ్వరరావు మార్కెట్ సెంటర్‌లో విజయవాడ మరాఠీ సమాజ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఏపీ విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ ముఖ్యఅతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. భారతీయ సంస్కృతిని కాపాడటంలో శివాజీ నిర్వహించిన పాత్ర అపూర్వమని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మండేపూడి ఛటర్జీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు నరహరశెట్టి నరసింహారావు, సమాజ్ అధ్యక్షుడు బాలాజీ, ప్రధాన కార్యదర్శి విలాస్‌పవార్, ప్రోగ్రామ్ ఆర్గనైజర్ ప్రవీణ్ బొస్లే, మాజీ కార్పొరేటర్ అవాల మారుతి, బులియన్ మార్కెట్ నాయకులు కేఎస్ఆర్ నాయుడు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

దైవచింతనతో ఆధ్యాత్మిక శక్తి

గుణదల(విజయవాడతూర్పు): ప్రతి ఒక్కరూ దేవుని పట్ల భయ భక్తులు కలిగి ఉండటం ద్వారా ఆధ్యాత్మిక శక్తితో పాటు దేవుని దీవెనలు పొందవచ్చని గుణదల మేరీమాత పుణ్య క్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు అన్నారు. పుణ్యక్షేత్ర ప్రధానాలయంలో ఆదివారం సమష్టి దివ్యబలి పూజ సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. దైనందిన జీవితంలో ప్రజలందరూ దేవునికి విధేయులుగా ఉండాలన్నారు. దేవుని ఆజ్ఞలను పాటిస్తూ పవిత్రంగా జీవించాలని సూచించారు. విశ్వాసులు ఆధ్యాత్మికంగా ఎదగాలంటే అనుదిన ప్రార్థన ముఖ్యమని పేర్కొన్నారు. దేవుని కట్టడలను అనుసరించిన భక్తుల జీవితాలు ఆశీర్వాదకరంగా ఉంటుందని చెప్పారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సమష్టి దివ్యబలిపూజ సమర్పించి భక్తులకు ప్రసాదాన్ని అందజేశారు.

వైభవంగా కన్యాకాపరమేశ్వరి అమ్మవారి ఊరేగింపు



కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణలంక మెట్లబజార్‌లోని వాసవీ భవన్‌లో వేంచేసి ఉన్న శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం వాసవీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా జరిగింది. మహాశివరాత్రి పర్వదినం మరుసటి రోజున వన్‌టౌన్‌లో జరిగే రథోత్సవం వద్దకు సంఘం సభ్యులు వాసవీ భవన్ నుంచి అమ్మవారిని ఊరేగింపుగా ఆదివారం సాయంత్రం తీసుకెళ్లారు. ముందుగా సంఘ సభ్యులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించి హారతులు ఇచ్చారు. అనంతరం అమ్మవారిని మేళతాళాల మధ్య ఊరేగింపుగా వన్‌టౌన్‌లోని రథం సెంటర్‌కు తీసుకెళ్లారు. అక్కడ నుంచి తిరిగి అమ్మవారిని ఊరేగింపుగా వాసవీ భవన్‌కు తీసుకొచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

నేత్రపర్వం.. శివపార్వతుల కల్యాణం

పెనుగంచిప్రోలు: గ్రామంలో శంభులింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి శ్రీశివపార్వతుల కల్యాణం ఆలయ అర్చకులు రేలంకి భాస్కరశర్మ ఆధ్వర్యంలో కల్యాణం ఘనంగా నిర్వహించారు. కల్యాణ పీటలపై కోయ కార్తీక్-మౌనిక, కాకాని రంజిత్‌కుమార్-నిషిత దంపతులు కూర్చున్నారు. కల్యాణానికి ముందు విజయవాడకు చెందిన కోరుకొండ రోహిణి కూచిపూడి నృత్య ప్రదర్శన, కోలాట నృత్యాలు, భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మహిళలకు లాటరీ ద్వారా చీరలు పంపిణీ చేశారు. శ్రీఅయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు వాసిరెడ్డి బెనర్జీ, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ముండ్లపాడు గ్రామంలోని పురాతన శివాలయంలో స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను, సర్పంచ్ గూడపాటి లావణ్య, జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్రరావు, సొసైటీ అధ్యక్షుడు గూడపాటి రవికుమార్, మాజీ ఎంపీపీ శ్రీనివాసరావు, విశ్రాంత డీఎస్పీ బోస్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుంటుపల్లి వాసు, తదితరులు పాల్గొన్నారు.

వత్సవాయి: శివరాత్రిని పురస్కరించుకుని శనివారం రాత్రి పలు గ్రామాల్లో శివకల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. దంపతులు పీటలపై కూర్చుని వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య కల్యాణం జరిగింది. లింగాల, మక్కపేటలలోని శ్రీరామలింగేశ్వరస్వామి వార్లు ఇందుగపల్లిలోని శ్రీ బాలకోటేశ్వరస్వామి, భీమవరం గ్రామంలోని శ్రీ కోనగిరి మల్లిఖార్జునస్వామి వార్ల కల్యాణాన్ని భక్తులు వీక్షించారు. ఆదివారం స్వామివార్ల ఉత్సవమూర్తులను ఆలయాల్లో గ్రామోత్సవం చేయగా భక్తులు నీరు వార పోసి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు కేవైఎస్ శర్మ, యగంధర్ శర్మ, సంగయ్యశర్మ, కొమరగిరి సవితాభరద్వాజ్, ఈవో సీహెచ్ హరిదుర్గానాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట: పట్టణంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో మహా శివరాత్రి సందర్భంగా శనివారం రాత్రి కనుల పండువగా స్వామి కల్యాణం నిర్వహించారు. ఆలయ అర్చకుడు సాయి ఆధ్వర్యంలో ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా తీసుకువచ్చి కల్యాణం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



కూడలి సంగమేశ్వర స్వామి కల్యాణోత్సవం

కూడలి సంగమేశ్వరస్వామి ఆలయంలో

నందిగామ: మహా శివరాత్రి పురస్కరించుకొని పలు చోట్ల శివ పార్వతుల కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. శనివారం అర్ధరాత్రి లింగోద్భవ సమయంలో ప్రముఖ పుణ్యక్షేత్రం దాములూరు కూడలి సంగమేశ్వర స్వామి కల్యాణం నేత్ర పర్వంగా సాగింది. శ్రీనివాసశర్మ ఆధ్వర్యాన వేద పండితులు కల్యాణం చేశారు. ఆలయ పాలకవర్గ చైర్మన్ కనగాల వెంకటేశ్వరరావు దంపతులు పీటలపై కూర్చున్నారు. స్థానిక అంకమ్మ ఆలయంలో భద్రకాళి సమేత వీరభద్ర స్వామి కల్యాణం ఘనంగా జరిగింది. నందిగామ మెయిన్ రోడ్డులోని రామలింగేశ్వరస్వామికి 108 లీటర్ల చెరకు రసంతో అభిషేకం చేశారు. పల్లగిరి గట్టుపై స్వయంభు శివ లింగం వద్ద శివ పార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. మున్నేటి తీరాన రైతుపేట డొంక్‌లోని విజ్ఞాన నందీశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారి కల్యాణం ఘనంగా చేశారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

ముక్త్యాల(జగ్గయ్యపేట): మహాశివరాత్రి సందర్భంగా శనివారం అర్ధరాత్రి స్వామి వారి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. అర్చకుడు జొన్నాభట్ల కిషోర్ శర్మ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు వారణాసి సాంబ శివరావు, తూమాటి లక్ష్మీనరసింహాచార్యులు, మద్దిరాల ప్రేమ్‌కుమార్ శర్మలు శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించేందుకు తరలివచ్చారు. కల్యాణ వేడుక కమనీయంగా జరిగింది. ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త తరపున కేసీపీ సిమెంట్స్ కర్మాగారం ప్రతినిధి రాంప్రసాద్, ఎస్ఐ దుర్గాప్రసాద్ కల్యాణోత్సవంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టు వస్త్రాలు సమర్పించారు. కల్యాణోత్సవాల సందర్భంగా దరిశల్లి శేషయ్య ఆలిండియా రేడియో ఆర్టిస్ట్ ఆధ్వర్యంలో వల్లభి నాదస్వర బృందంచే మంగళవాయిద్యాలు, జానపద భక్తి సంగీతం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఇన్‌చార్జ్ ఈవో నాగరాజు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. కల్యాణం అనంతరం లింగోద్భవ అన్నాభిషేకం నిర్వహించారు. ఉత్సవాల అధికారి దాసరి శ్రీరామవరప్రసాద్, సీఐ నాగమురళి ఆధ్వర్యంలో సర్కిల్‌లోని చిల్లకల్లు, వత్సవాయి, పెనుగంచిప్రోలు, జగ్గయ్యపేట ఎస్ఐలు బందోబస్తు నిర్వహించారు.



ముక్త్యాలలో శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

హరిహర క్షేత్రంలో..

గ్రామ సమీపంలోని కోటిలింగ హరిహర క్షేత్రంలో కామాక్షి సమేత పంచముఖ అమృతలింగేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవం అర్ధరాత్రి ఒంటి గంటకు జరిగింది. మూలవిరాట్‌కు 108 కేజీల అన్నంతో శాస్త్రోక్తంగా అన్నాభిషేకం నిర్వహించారు. ఇన్‌చార్జ్ ఈవో నాగరాజు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తిరుమలగిరిలో..

వాల్మీకోద్భవ వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అర్చకులు తిరునగరి రామకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. అనంతరం స్వామి వారికి గ్రామోత్సవం నిర్వహించారు. చైర్మన్ రాదాసుబ్రహ్మణ్యం, ఏసీ శ్రీరామవరప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చూడాలి

- జిల్లా వైద్యాధికారి సుహాసిని
- ఆటోనగర్‌లో వైద్య శిబిరం సందర్శన
- రక్త పరీక్షల నిర్వహణ

జగ్గయ్యపేట అర్బన్: పట్టణం, పరిసర ప్రాంతాల్లో దోమల వలన జ్వరాలు తదితర వ్యాధులు ప్రబలకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకొంటూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుహాసిని అన్నారు. జగ్గయ్యపేట మున్సిపాలిటీ పరిధిలో జాతీయ రహదారిపై షేర్‌మహ్మద్‌పేట క్రాస్ రోడ్‌లో ఉన్న ఆటోనగర్‌లోని అమోదా ఇండస్ట్రీస్ పరిధిలో నివాసం ఉంటున్న పలువురికి శనివారం జ్వరాలు వచ్చాయి. దీంతో విషయం తెలుసుకున్న జిల్లా వైద్యాధికారి సుహాసిని ఆదేశాల మేరకు బూచవరం వైద్యాధికారి డాక్టర్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం ఈ వైద్య శిబిరాన్ని జిల్లా వైద్యాధికారి సుహాసిని, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతిబాబు పర్యవేక్షించారు. పరిసర ప్రాంతాల్లో దోమల లార్వా దశ నాశక మందులు చల్లించడం, దోమల నిర్మూలకు ఫాగింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. జిల్లా వైద్యాధికారి సుహాసిని మాట్లాడుతూ అమోదా ఇండస్ట్రీస్ పరిధిలో నివాసం ఉంటున్న పలువురికి జ్వరాలు సోకాయని తెలిపారు. దీంతో యుద్ధ ప్రాతిపదికన ముందస్తు జాగ్రత్తగా మలేరియా, డెంగ్యూ తదితర వ్యాధులు సోకాయేమోనని వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి మలేరియా పరీక్షలు చేసినట్లు తెలిపారు. మొత్తం 12 మందికి మలేరియా ర్యాపిడ్ పరీక్షలు చేయగా, అందరికీ నెగెటివ్ వచ్చినట్లు తెలిపారు. పట్టణంలోని మిట్టగూడెం, కోదాడ రోడ్‌లోని కొల్లా కాంప్లెక్స్‌లో ఏర్పాటుచేసిన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ల వైద్య బృందంతో ఫీవర్ సర్వే, లార్వా ఆపరేషన్, ఫాగింగ్ చేయించామన్నారు. ప్రజలు తమ పరిసరాల్లో దోమలు వృద్ధి చెందకుండా నీటిని నిల్వ ఉంచుకోకుండా ఉండాలని తెలిపారు. కాచి చల్లార్చిన నీటినే వాడాలన్నారు. వైద్య శిబిరం జ్వరాలు తగ్గే వరకు కొనసాగుతుందని వివరించారు. ప్రభుత్వ వైద్యులు డాక్టర్ నాగరాణి, షాలిన, బూచవరం, పెనుగంచిప్రోలు, వత్సవాయి, పేట ప్రభుత్వాస్పత్రుల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



మెడికల్ క్యాంపును పరిశీలిస్తున్న జిలాల వైద్యాధికారి సుహాసిని

వృద్ధుడిపై దాడి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంటి ముందు బైక్ పెట్టవద్దనందుకు వృద్ధుడిపై దాడి చేసిన ఘటన కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వించిపేట సీఎస్ఐ చర్చి ప్రాంతానికి చెందిన కాటూరి ఇమ్మానుయేల్ ఒంటరిగా ఉంటాడు. శనివారం రాత్రి 10.30 గంటల సమయంలో ఓ యువకుడు ఇమ్మానుయేల్ ఇంటి ముందు బైక్ పార్కింగ్ చేయసాగాడు. దీంతో తన ఇంటి ముందు బైక్ పెట్టవద్దని చెప్పడంతో ముఖంపై చేతితో గుద్దాడు. దీంతో కింద దవడ నుంచి తీవ్ర రక్తం రావడంతో బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రవాణా రంగ కార్మికుల జీవనంపై కేంద్రం దాడి

కృష్ణలంక(విజయవాడతూర్పు): కేంద్ర ప్రభుత్వం రోడ్డు భద్రత చట్టం – 2020 తీసుకొచ్చి రవాణా రంగ కార్మికుల జీవనంపై దాడి చేసిందని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఇఫ్టూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.మోహన్ చెప్పారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో ఇఫ్టూ నాయకుడు కె.రవీంద్ర అధ్యక్షతన ఆదివారం ఇఫ్టూ విజయవాడ నగర 5వ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ.. ప్రజలకు రవాణా సౌకర్యాన్ని కల్పిస్తున్న ఆటో, రవాణా రంగ కార్మికులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దాడిని ప్రతిఘటించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఆటో, రవాణా రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందన్నారు. దేశ ప్రజల సొమ్మును కొల్లగొడుతున్న గౌతం అదానీలాంటి కార్పొరేట్ శక్తులకు అన్ని రంగాలను నిబంధనలను అతిక్రమించి నరేంద్ర మోదీ ప్రభుత్వం అక్రమంగా కట్టబెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.రామకృష్ణ, పీఓడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు ఎల్.రమాదేవి, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు గనిరాజు తదితరులు మాట్లాడారు. అనంతరం 19 మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఉమాపతి, వంశీ కిరణ్, సురేష్, బసవయ్య, కాశీరెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

నేడు తహసీల్దార్ కార్యాలయంలో స్పందన

కంచికచర్ల: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి జరగనుందని తహసీల్దార్ వద్దేశ్వరపు రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో సమస్యలను పరిష్కరించడానికి ప్రజలు అర్జీల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వచ్చిన అర్జీలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తారని తెలిపారు.

వాహనాల తనిఖీ

వీరులపాడు: నిబంధనలకు అనుగుణంగా వాహనాలు నడపాలని ఎస్ఐ సోమేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని పెద్దాపురం సమీపంలో ఆదివారం వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనచోదకులు మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు అన్ని రికార్డులు వెంట ఉంచుకోవాలని తెలిపారు. రికార్డులు సక్రమంగా లేని వాహనాలు గుర్తించి వాహనచోదకులకు జరిమానా విధించారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

బైక్ అపహరణపై ఫిర్యాదు.. గంటలోనే పట్టుకున్న పోలీసులు

కంచికచర్ల : ఇంటి ఆవరణలో పార్కింగ్ చేసిన బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారని ఫిర్యాదు చేయగా గంటలోనే పోలీసులు ఆ వాహనాన్ని పట్టుకుని యజమానికి అందజేశారు. ఎస్ఐ పెంకె సత్య వెంకట సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాల ప్రకారం కంచికచర్లలో ప్రణీత జంగాల కాలనీకి చెందిన నేలపాటి వెంకటేశ్వరరావు తన బైక్‌ను ఇంటి ఆవరణలో శనివారం రాత్రి పార్కింగ్ చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆ బైక్‌ను అపహరించారు. బైక్ యజమాని ఆదివారం ఉదయం పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీస్ సిబ్బంది రెండు బృందాలుగా ద్విచక్ర వాహనం కోసం వెదికారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా ఫిర్యాదు అందిన గంటలోపే పోయిన బైక్‌ను గుర్తుపట్టారు. వెంటనే పోలీసులు పోయిన ఆ వాహనాన్ని యజమానికి అప్పగించారు.

దుర్గగుడి ట్రస్ట్‌బోర్డు సభ్యుడికి సన్మానం

తిరువూరు: విజయవాడ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థాన పాలకమండలి సభ్యుడిగా నియమితులైన దేవిశెట్టి బాలకృష్ణను తిరువూరు ఆర్యవైశ్య కల్యాణ మంటపంలో ఆదివారం సన్మానించారు. ఆర్యవైశ్య సంఘం , తిరువూరు నియోజకవర్గ యాదవ సంఘం సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో బాలకృష్ణను పలువురు సత్కరించారు. ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు గజ్జల సీతారామారావు, గుడిమెట్ల మురళి, కంచర్ల ముత్యప్రసాద్, యాదవ సంఘ నాయకులు యరదేశి రామారావు తదితరులు పాల్గొన్నారు.

సందడిగా ఆత్మీయ సమ్మేళనం



గండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1989-90 టెన్త్ విద్యార్థులు

కంచికచర్ల: గండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1989–90 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఒకే వేదికపై కలుసుకున్నారు. పలు ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడినవారంతా ఒకేచోట కలుసుకుని ఆనాటి జ్ఞాపకాలను వారంతా గుర్తు చేసుకున్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకారమందిస్తామని నాటి విద్యార్థులు భరోసా ఇచ్చారు. పాఠశాలలో రేకుల షెడ్డు మరమతుల కోసం రూ. 2లక్షల ఆర్థిక సాయం చేయనున్నట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు. అనంతరం పాటలు పాడుతూ, డ్యాన్స్ చేస్తూ సందడిగా గడిపారు. కార్యక్రమంలో శ్రీరాం కాశీరావు, పవన్‌కుమార్, విద్యాసాగర్‌రెడ్డి, సాంబ శివ, సుంకర శ్రీనివాసరెడ్డి, తలశిల శ్రీనివాసరావు, వజ్రకుమార్, మర్రిపల్లి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని, తరచూ నీటిని తీసుకోవాలని ఆయుర్వేద వైద్య నిపుణుడు డాక్టర్ ఏవీఎస్‌కే ప్రసాద్ సూచించారు. స్థానిక దుర్గాపురం విజయ్‌నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఆరోగ్య అవగాహన, ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శీతాకాలంలో చలిగా ఉండటం వల్ల నీరు తక్కువగా తాగటం వల్ల రీనల్ సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతీ ఒక్కరూ తమ శరీరానికి సరిపడా నీటిని తీసుకోవాలని సూచించారు. రీనల్ సమస్యలకు ఆయుర్వేదంలో మంచి మందులు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రముఖ హోమియో వైద్యనిపుణులు డాక్టర్ కోన వీరబ్రహ్మం మాట్లాడుతూ.. ప్రస్తుతం కిడ్నీ సమస్యలు అధికమయ్యాయన్నారు. దీనికి కారణం తగినంత నీటిని తీసుకోకపోవటమేనన్నారు. ముఖ్యంగా మహిళలు శరీరానికి అవసరమైనంత నీటిని తీసుకునేలా కుటుంబ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. హోమియో చికిత్స ద్వారా ఎటువంటి దుష్ఫలితాలు లేకుండా కిడ్నీ సమస్యలను తగ్గించే అవకాశం ఉందన్నారు. వ్యాధి వచ్చిన తరువాత బాధపడేకన్నా ముందుగా రాకుండా చూసుకోవటం మంచిదన్నారు. అనంతరం ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టీ తట్టి అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం

ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రహదారుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా జగ్గయ్యపేట–చిల్లకల్లు మధ్య రూ.14 కోట్ల నిధులతో చేపట్టిన ఫోర్ లైన్ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగ్గయ్యపేట నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా పలు కార్యక్రమాలను చేపట్టామన్నారు. ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా అనేక చోట్ల రోడ్ల నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. పట్టణం నుంచి చిల్లకల్లుకు ఫోర్ లైన్ రోడ్డు నిర్మాణ పనులను త్వరలో పూర్తిచేసి ప్రయాణికులకు అందుబాటులో తీసుకొస్తామని తెలిపారు. కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పనులు పూర్తిచేయాలని కోరారు. ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కఠారి హరి, నాయకులు చారుగుండ్ల కొండ, పాటి సాంబ, వేల్పుల విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

క్రీడాకారిణికి ఆర్థిక సాయం

జగ్గయ్యపేట అర్బన్: పవర్ లిఫ్టింగ్‌లో జాతీయ అవార్డు సాధించిన పేట క్రీడాకారిణి పోతన ప్రవల్లికకు స్థానిక శ్రీకృష్ణదేవరాయ సేవాసమితి(కాపు సంఘం) వారు రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక కోదాడ రోడ్‌లోని సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు యలమంచి రాజేంద్ర, ముత్యాల శేషు, సేవాసమితి సభ్యులు క్రీడాకారిణికి ఆర్థిక సహాయం అందజేశారు. వారు మాట్లాడుతూ క్రీడాకారిణి పోతన ప్రవల్లిక జాతీయ స్థాయిలో ప్రతిభ కనపరచడమే కాకుండా జమ్మూ కాశ్మీర్‌లో జరగనున్న జాతీయ పోటీల టూర్‌కు వెళుతున్న సందర్భంగా ప్రోత్సాహకంగా ఈ ఆర్థిక సహాయం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సేవాసమితి కోశాధికారి కామిశెట్టి అమరనాథ్, ఉపాధ్యక్షుడు సలాది సూరిబాబు, వట్టి మనోహర్, గౌరవ అధ్యక్షుడు గోగుశెట్టి మహేష్, సేవాసమితి ప్రతినిధులు పసుపులేటి సత్యశ్రీనివాస్, చిట్టిపోతుల సత్యనారాయణ, గంధం శేషగిరిరావు, సీహెచ్.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారిణికి ఆర్థిక సహాయం అందజేస్తున్న శ్రీకృష్ణదేవరాయ సేవాసమితి ప్రతినిధులు

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

జగ్గయ్యపేట అర్బన్: మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర సోదరుని వివాహం పురస్కరించుకొని జగ్గయ్యపేట మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బందికి నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం చైర్మన్ నివాసంలో ఏర్పాటుచేసిన పంపిణీ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ముఖ్య అతిథిగా పాల్గొని మున్సిపల్ కార్మికులు, సిబ్బందికి నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఉదయభాను మాట్లాడుతూ శుభకార్యాలకు ఇలాంటి సేవా కార్యక్రమాలను ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. ఇలాంటి ఆదర్శనీయమైన సంప్రదాయాన్ని అందరూ పాటించాలని, తద్వారా సమాజానికి మేలు జరుగుతుందన్నారు. నూతన వధూవరులు రంగాపురం అభిషేక్, రితీష, మున్సిపల్ వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, హఫీజున్నీసా ఫిరోజ్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను, పక్కన మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర

దళిత వాదాన్ని బలంగా వినిపించాలి

విజయవాడకల్చరల్: దళిత వాదాన్ని బలంగా వినిపించి తమ అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి కృషి చేయాలని ఐద్వా నాయకురాలు రమాదేవి తెలిపారు. ఎండ్లూరి మానస, అరుణ గోగులమండ సంకలన పరచిన ముళ్ళ చినుకులు దళిత కథా సంకలనం ఆవిష్కరణ సభను శిఖామణి సెంటర్‌ని శిఖరా పాఠశాలలో సంకలనకర్తలు ఆదివారం నిర్వహించారు. కథా సంకలనాన్ని ఆవిష్కరించిన రమాదేవి మాట్లాడుతూ దళితుల పట్ల పాలక పక్షాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, వాటిని ఎదుర్కోవడానికి పోరాటం సాగుతూనే ఉందన్నారు. పోరాటాలు విస్తృతం చేయడానికి దళిత కవులు, రచయితలు లక్ష్యాలను నిర్దేశించుకోవాల్సిన అవసరముందని చెప్పారు. కవి అరసవిల్లి కృష్ణ కథా సంకలనాన్ని సమీక్ష చేస్తూ కథలు వాస్తవానికి దగ్గరగా ఉన్నాయన్నారు. ఏ సాహిత్యమైనా ప్రజల నుంచి రావాలని, ప్రజల కోసమే రాయాలని సూచించారు. సంకలనంలోని రచయితలు సమాజంలో దళితులు ఎదుర్కొంటున్న అనేక అంశాలను ప్రస్తావించారన్నారు. కథా సంకలన సంపాదకులు మానస, అరుణ మాట్లాడుతూ తమ లక్ష్యం నెరవేరిందన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి శాంతిశ్రీ సభకు అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగ రథసారథి బీఆర్ అంబేడ్కర్ అందరి వాడని ఆయన సేవలను నేటి తరం యువతీ యువకులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యావేత్త బండ్ల మాధవరావు, యువ కవి అనిల్ డ్యానీ, కంచర్ల చిట్టిబాబు పాల్గొన్నారు.



ముళ్ళచినుకులు దళిత కథా సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న రమాదేవి, మానస, అరుణ, అరసవిల్లి కృష్ణ, శాంతి శ్రీ

వృద్ధులకు నిత్యావసర సరుకుల పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): వయోవృద్ధులకు 188 నెలలుగా సేవలు అందించటంలో ట్రస్ట్ వైస్ చైర్మన్ తేజ్‌రాజ్ సోలంకి పాత్ర అద్వితీయమని శ్రీ శంభవనాథ్ రాజేంద్రసూరి జైన్ స్వేతాంబర్ ట్రస్ట్ అధ్యక్షుడు సోలంకి రాజేంద్ర కుమార్ జైన్ అన్నారు. స్థానిక దుర్గాపురం విజయ్‌నర్సింగ్ కళాశాలలో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన దాత తేజ్‌రాజ్ సోలంకి, కాంచనదేవి సహకారంతో వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ట్రస్ట్ ఏర్పాటు చేసినప్పటి నుంచి వయోవృద్ధులకు మరింత మెరుగైన సేవలు అందించటానికి సోలంకీ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. 70 ఏళ్లు దాటిన వృద్ధులను గుర్తించి వారికి ప్రతి నెలా నాణ్యమైన నిత్యావసర సరుకులు ఉచితంగా అందించటంతో పాటు ఉచిత వైద్యపరీక్షలు మందులు అందజేయటం అభినందనీయమని కొనియాడారు.

ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలి

గౌరవ అతిథి శ్రీశంభవనాథ్ జైన్ శ్వేతాంబర్‌మూర్తి పూజక్ సంఘం కార్యదర్శి పన్నాలాల్ డి.జైన్ మాట్లాడుతూ ఇంత మంచి కార్యక్రమంలో పాల్గొనే అవకాశం తనకు లభించటం ఆనందంగా ఉందన్నారు. లయన్స్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డి.గోపీనాథ్ మాట్లాడుతూ.. తేజ్‌రాజ్ సోలంకీ లయన్స్ క్లబ్‌తో పాటు వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ తదితర 11 సంస్థల ద్వారా అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, ట్రస్టీ తట్టి అర్జునరావు మాట్లాడుతూ.. ట్రస్ట్ అభ్యున్నతికి అహర్నిశలు సహకరిస్తున్న సోలంకీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టీలు అమర ఉమామహేశ్వరరావు, ఎస్ఎన్ వరప్రసాద్, నీలీ సతీష్‌కుమార్, కె.మధుసూదనరావు, పి.లక్ష్మీనరసింహారావు తదితరులు పాల్గొని మాట్లాడారు.